ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
సోమవారం, 8 ఏప్రిల్ 2024





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	44.4	27
భద్రాద్రి	44	27



ఇఫ్తార్ (సా) : 6:28 (సోమవారం)
సహర్ (ఉ) : 4:36 (మంగళవారం)





పంటకోసం భగీరథ యత్నం

- కంకిదశలో మొక్కజొన్న తోటలు
- సాగునీటికోసం వైరా మండలం గండగలపాడు రైతుల అష్టకష్టాలు
- ట్రాక్టర్ పుల్లింగ్‌తో ఓ గుంతలోని నీటి తరలింపు

వైరా, ఏప్రిల్ 7: ఖమ్మం జిల్లా వైరా మండలం గండగలపాడుకు చెందిన కొంతమంది రైతులు చివరి దశలో ఉన్న తమ మొక్కజొన్న పంటలను కాపాడుకొనేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. తమ గ్రామానికి సమీపంలోని ఓ గుంతలో ఉన్న మురుగునీటిని ఎన్నో వ్యయప్రయాసలకోర్చి కంకిదశలో ఉన్న తమ మొక్కజొన్న పంటకు అందిస్తున్నారు. గుంతలోని మురుగునీటిని ట్రాక్టర్ పుల్లింగ్ సహాయంతో తోడి పైపులైన్ ద్వారా కాల్వకు మళ్లించి అక్కడి నుంచి కొంత దూరంలోని మొక్కజొన్న పంటకు అందిస్తున్నారు. మొక్కజొన్న కంకి వేసి విత్తనం గట్టిపడే దశలో నీరు సరిగా అందక ఎండిపోయే దుస్థితికి చేరింది. దాంతో కొంతమంది రైతులు తమ మొక్కజొన్న పంటను కాపాడుకొనేందుకు ఖర్చుకు వెరవకుండా భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు.





వారంక్రితం వెలవెల.. నేడు జలకళ

- 18 అడుగులకు చేరిన పాలేరు జలాశయం
- సాగర్‌నుంచి నీటి విడుదల నిలిపివేత
- మంత్రి తుమ్మల కృషితో మూడు జిల్లాలకు తీరిన తాగునీటి కష్టాలు

కూసుమంచి, ఏప్రిల్ 7: వారం క్రితం 5.5 అడుగులతో వెలవెలబోయిన పాలేరు జలాశయం.. నేడు సాగర్ జలాలతో కళకళలాడుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట, మానుకోట జిల్లాలకు తాగు నీరు అందించేందుకు సాగర్‌నుంచి ఈనెల ఒకటిన నీటిని విడుదల చేయగా.. ప్రస్తుతం 3,300 క్యూసెక్కులు పాలేరు చేరుతోంది. ఆదివారం సాయంత్రానికి పాలేరు నీటిమట్టం 18అడుగులకు చేరుకుంది. సోమవారం ఉదయానికి 18.5అడుగులకు చేరే అవకాశం ఉంది. అయితే ఆదివారం ఉదయం సాగర్ నుంచి నీటి విడుదల నిలిపేశారు. మంత్రి తుమ్మల కృషితో పాలేరుకు రెండు టీఎంసీల సాగర్ నీటిని కేటాయించిన అధికారులు ముందుగా సూర్యాపేట జిల్లా పెద్దదేవులపల్లి, పొనుగోడు రిజర్వాయర్‌లను నింపి, తరువాత పాలేరుకు తరలించడంతో ఒక్క టీఎంసీ నీరు మాత్రమే వచ్చిందని ఐబీ అధికారులు తెలిపారు.

ముగిసిన దోబూచులాట

- సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం
- సస్పెన్స్‌కు తెరదించిన డాక్టర్
- ఆయన చేరికపై పొదెం అనుచరుల్లో అసహనం?
- సమాచారం ఇవ్వలేదని అసంతృప్తి
- తెల్లం వెంకట్రావుపై న్యాయపోరాటం చేస్తాం: ఎమ్మెల్సీ తాతా మధు

భద్రాచలం, ఏప్రిల్ 7: ఎట్టకేలకు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ గూటికి చేరారు. ఆయన పార్టీ మార్పుపై కొంతకాలంగా సాగుతున్న దోబూచులాట ఎట్టకేలకు ముగిసింది. గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి భద్రాచలం ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ తెల్లం వెంకట్రావు తొలినుంచీ పార్టీ మారతారని ప్రచారం జరిగింది. అందుకు అనుగుణంగానే ఆయన వ్యవహార శైలికూడా ఉండేది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు, పార్టీ కీలక సమావేశాలకు గైర్హాజరైన తెల్లం తీరుతో పార్టీ అధిష్ఠానం సైతం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఎట్టకేలకు సీఎం రేవంత్, ఉమ్మడి జిల్లా మంత్రి పొంగులేటి సమక్షంలో తెలం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పార్టీ మార్పు దోబూచులాటకు తెరపడింది. ఇదిలా ఉండగా డాక్టర్ తెల్లం వెంకట్రావు గతేడాది ఏప్రిల్‌లో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో 46రోజులపాటు ఆ పార్టీలో ఉన్న ఆయన భద్రాచలం నుంచి కాంగ్రెస్ టికెట్ దక్కదనే ఆలోచనతో మళ్లీ బీఆర్‌ఎస్ గూటికి చేరారు. దాంతో బీఆర్‌ఎస్ అధిష్ఠానం ఆయనకు భద్రాచలం టికెట్‌ను కేటాయించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, భద్రాచలం సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను ఓడించారు. కానీ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోయింది. పైగా ఉమ్మడి ఖమ్మంజిల్లానుంచి తాను ఒక్కడు మాత్రమే బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికయ్యారు. అయితే ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత డాక్టర్ తెల్లం తాను కేసీఆర్ వెంటే నడుస్తానని, బీఆర్‌ఎస్‌ను వీడబోనని పలుమార్లు ప్రకటించారు. కానీ ఆయన చేతలు మాత్రం బీఆర్‌ఎస్‌ను దూరం పెడుతున్నట్టుగా సాగాయి. చివరికి ఎట్టకేలకు మళ్లీ కాంగ్రెస్‌లోకి చేరడంతో ఆయన పార్టీ మార్పుపై జరుగుతున్న చర్చకు తెరపడినట్లయింది.

పొదెం అనుచరుల అసహనం?

ఇదిలా ఉండగా గత మూడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో ఉన్న పొదెం వీరయ్యకు ఏ మాత్రం సమాచారం లేకుండా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం పట్ల ఆ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, వీరయ్య అనుచరులు ఆక్షేపణలు వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఏఐసీసీ సభ్యుడిగా, పీసీసీ ఉపాధ్యక్షుడిగా, భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న పొదెం వీరయ్యకు కనీస సమాచారం ఇవ్వకపోవడం పట్ల ఆయన అభిమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ ఎన్ని తాయిలాలు ఎర చూపినా పార్టీ మారని పొదెం వీరయ్యకు కనీసం సమాచారం ఇవ్వకుండా స్థానిక ఎమ్మెల్యేను చేర్చుకోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

'తెల్లం వెంకట్రావుపై న్యాయ పోరాటం చేస్తాం'

బీఆర్‌ఎస్ ద్వారా భద్రాచలం ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరడంపై న్యాయ పోరాటం చేస్తామని ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలిపారు. భద్రాచలంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ మారిన తెల్లం వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెల్లం సభ్యత్వాన్ని రద్దు చేయాలని స్పీకర్‌ను కోరతామని ఎమ్మెల్సీ తాతా మధు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారానికి వచ్చే ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును నిలదీయాలని భద్రాచలం నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. త్వరలోనే భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేస్తామని.. ఈ దిశగా ఇప్పటికే పార్టీ అధిష్ఠానం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ఈ క్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రావులపల్లి రాంప్రసాద్‌ను నియమించే అవకాశాలున్నట్టు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయన నియామకంపై అధికారిక ప్రకటన మూడు రోజుల్లో కేటీఆర్, హరీశ్‌రావుల ఆమోదంతో వస్తుందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

కొండెక్కిన కోడి



- చికెన్ కేజీ రూ.300-320లకు చేరిన ధరలు
- నగరంలో సిండికేట్‌తో ధరలు పెంచుతున్న వ్యాపారులు
- గ్రామాల కంటే కేజీకి రూ.50 అదనంగా వసూలు
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు



ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 7: భగభగ మండే ఎండలకు తోడు చికెన్ ధరలు మండిపోతున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉసూరుమంటున్నారు. ఖమ్మం నగరంలో స్కిన్‌లెస్ చికెన్ ధర కేజీ రూ.300నుంచి రూ.320 వరకు ఉండగా స్కిన్ చికెన్ ధర రూ.280నుంచి రూ.290, బోన్‌లెస్ చికెన్ రూ.500 నుంచి రూ.550 పలుకుతోంది. లైవ్ కోడి కేజీ రూ.170 వరకు ఉండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. మార్కెట్‌లో చికెన్ కొనాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వారం క్రితం కేజీ రూ.200 నుంచి రూ.220 లభించిన చికెన్ ప్రస్తుతం రూ.300లు దాటిపోవడంతో మాంసప్రియులు ఉసూరుమంటున్నారు. రోగ నిరోధక శక్తికి కనీసం వారానికి ఒకసారైనా చికెన్ తినాలని వైద్యులు సూచించడంతో ప్రజలు కోడిమాంసాన్ని ఎక్కువగా తమ ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. అయితే ఎండలు ముదురుతుండటంతో ఫారాల్లో కోళ్లు చనిపోతున్నాయని, ఈ నేపథ్యంలోనే డిమాండ్ అధికంగా ఉండడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. కోళ్ల ఫారాల్లో కోళ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో వంటి కారణాలతో మార్కెట్‌లో చికెన్ ధరలు పెరిగిపోతున్నాయి.

ఖమ్మం నగరంలో సిండికేట్ దందా..

ఖమ్మం నగరంలో చికెన్ వ్యాపారంలో సిండికేట్ దందా నడుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఇతర పట్టణాలు, పల్లెల్లో కంటే ఖమ్మంలో చికెన్ ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి చికెన్ ధరలు పెంచుతున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో కేజీ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.260 ఉండగా.. ఖమ్మం నగరంలో కిలో రూ.300 నుంచి రూ.320లకు విక్రయిస్తున్నరు. గ్రామాల్లో కంటే కేజీకి రూ.50ల నుంచి రూ.60 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. సాధారణంగా చికెన్ అమ్మకాలు రోజూ పేపర్‌లో వచ్చే ధరల ప్రకారం జరుగుతాయి. హైదరాబాద్ వంటి నగరాల్లోనూ ఇదే విధానం అనుసరిస్తారు. కానీ ఒక్క ఖమ్మం నగరంలో మాత్రమే వ్యాపారులు సిండికేట్‌గా మారి చికెన్ ధరలను ఇష్టానుసారంగా నిర్ణయించి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. పేపర్ ధరకు అనుగుణంగా ఉండాల్సిన చికెన్ రేట్లు నగరంలో అధికంగా ఉంటున్నాయని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో చికెన్ సిండికేట్ దందా ఎన్నో ఏళ్లుగా సాగుతున్నా దీన్ని అడ్డుకునే అధికారులు, పాలకులు లేకపోవడం దారుణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

చికెన్ అధిక ధరలను నియంత్రించాలి : కె.సత్యనారాయణ, వినియోగదారుడు



వ్యాపారుల తమ ఇష్టారాజ్యంగా పెంచుతున్న చికెన్ ధరలను అదుపులోకి తీసుకురావాలి. చికెన్ సిండికేట్‌పై అధికారులెవరూ పట్టించుకోవట్లేదు. అధిక ధరలకు అమ్మేవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అధికారులు అధిక ధరలు నియంత్రించి వినియోగదారులకు అందుబాటులో ఉంచాలి.

కోళ్ల ధరలు పెరగడంతో గిరాకీ బాగా తగ్గింది: మల్లెల వీరభద్రం,వ్యాపారి



చికెన్ ధరల భారీగా పెరగడంతో గిరాకీ తగ్గింది. చికెన్ షాపులకు ఎవరూ రావడంలేదు. ఎండాకాలం కావడంతో పెద్ద పెద్ద చికెన్ కంపెనీలు కోడి పిల్లల ఉత్పత్తిని భారీగా తగ్గించాయి. దీంతో కోళ్ల కొరత ఏర్పడింది. ఫౌల్ట్రీల్లో ప్రస్తుతం లైవ్ కోడి కిలో రూ.150 నుంచి రూ.170వరకు లభిస్తున్నాయి. అక్కడ కంపెనీల్లో ధర తగ్గిస్తేనే చికెన్ ధరలు అదుపులోకి వస్తాయి.

10న ఎంపీగా రేణుకా చౌదరి ప్రమాణం



ఖమ్మం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతిప్రతినిధి): తెలంగాణ ఎమ్మెల్యేల కోటాలో కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి 10వ తేదీన ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. బుధవారం ఉదయం 11గంటలకు రాజ్యసభలో ప్రమాణ స్వీకారం చేసేందుకు ఆమె ముహూర్తం నిర్ణయించుకున్నారు. రాజ్యసభలోని రూం నెంబర్ 100 ఫస్ట్‌ఫ్లోర్‌లో రేణుకాచౌదరి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె ముఖ్య అనుచరులు ఢిల్లీకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ప్రపంచ పారా అథ్లెటిక్స్‌కు శ్రీను

పారిస్ జరిగే పోటీలకు నగర క్రీడాకారుడు

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 7: పారిస్ దేశంలో త్వరలో జరగనున్న ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీలకు నగరానికి చెందిన పారా అథ్లెట్ బత్తుల శ్రీను ఎంపికయ్యాడు. బెంగుళూరులో మార్చి 24 నుంచి 26 వరకు జరిగిన 6వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటి రజత పతకం గెలుచుకున్నాడు. పోటీల్లో ఆయన ఎఫ్-35 విభాగంలో 10.0 మీటర్లు షాట్‌పుట్ విసిరి ద్వితీయ స్థానంలో నిలిచాడు. అంతేకాకుండా ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి నలుగురు క్రీడాకారులు మాత్రమే ఎంపిక కాగా అందులో నగరానికి చెందిన శ్రీను ఒకరు కావడం విశేషం. ఈ సందర్భంగా అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన బత్తుల శ్రీనును డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు అభినందించారు. అంతర్జాతీయ పోటీలలో సైతం విజయం సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.



పతకం అందుకుంటున్న బత్తుల శ్రీను



నిర్మానుష్యంగా కొత్తగూడెం బస్టాండ్ సెంటర్

మండిన సన్‌డే

- నేలకొండపల్లిలో అత్యధికంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఇరు జిల్లాల్లో పలుచోట్ల 40 డిగ్రీలపైనే..
- రాత్రివేళ చల్లబడుతున్న వాతావరణం

ఖమ్మం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుతూనే సూరీడు వేడెక్కిపోతున్నాడు. నడినెత్తికి వచ్చేసరికి మాడు పగిలిపోయే ఎండ మండిపోతోంది. గతవారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే ఆదివారం కూడా పగలు ఎండలు మండిపోయినా రాత్రివేళ వాతావరణం చల్లబడింది. ఆదివారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో అత్యధికంగా 44.4డిగ్రీలు, కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో అత్యధికంగా 43.6డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం జిల్లాలో సగటున 39.3డిగ్రీల సాధారణ ఉష్ణోగ్రత కాగా ఆదివారం 42డిగ్రీలు నమోదైంది. కొత్తగూడెం జిల్లాలో 39.2 డిగ్రీలకుగాను 41.8డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 2.5 డిగ్రీలకు పైగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు తెలుస్తోంది.



గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న మానవ హక్కుల సంఘ సభ్యులు

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

- గిరిజనులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి
- చంద్రాయపాలెం ఘటనపై నిజనిర్ధారణ
- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

సత్తుపల్లి రూరల్, ఏప్రిల్ 7: గిరిజనులకు చెందిన పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతనెల 31న సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో జరిగిన దాడి ఘటనపై పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిజనిర్ధారణ చేశారు. ఈ సందర్భంగా చంద్రాయపాలెం, గాంధీనగరం, రుద్రాక్షపల్లి, బుగ్గపాడు గ్రామాల ప్రజలు, అటవీ అధికారులు, స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. వివాదాస్పద భూముల వివరాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులు, కేసులు బనాయించి జైలు జీవితం గడుపుతున్న కుటుంబాల పరిస్థితి, అటవీ, రెవెన్యూ శాఖలు తీరు తదితర అంశాలను గిరిజనులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం సత్తుపల్లిలోని కళాభారతి ఆడిటోరియంలో పౌరహక్కుల సంఘ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ చంద్రాయపాలెం ఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అమాయక గిరిజనులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 1,000ఎకరాల భూమి అక్కడి ప్రజలకు సమానంగా పంచాలని, వన సంరక్షణ సమితి పథకాన్ని పూర్తిగా రద్దుచేసి గిరిజనులపై దరుసుగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా వివాదాస్పదంగా మారిన భూమిని అక్రమంగా లాక్కుని అటవీశాఖ సాగు చేస్తుందని, ఆ సమస్యను పరిష్కరించకుండా కొత్తగా గిరిజనులపై విరుచుకుపడంతో భూసమస్య కాస్తా గిరిజనులు, పోలీసుల మధ్య గొడవగా మారిందన్నారు. దీంతో వందల ఎకరాల భూపట్టాల సమస్య మళ్లీ వెనక్కి పోయిందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించకుంటే గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్.నారాయణరావు, కూకలకుంట రవి, ఏ.రవీందర్, బాలయ్య, ఉపేందర్, డీ.శిరీష, కాటినేని శ్రీనివాస్, జీ.ఉదయరాఘవేందర్, దుర్గారెడ్డి, ఎస్వీ.రమణ, వెంకటేష్, రాయల శ్రీధర్, విజయ్, గంగా శ్రీనులు పాల్గొన్నారు.



4

గ్రాసానికి గడ్డు కాలం

- నేటి వరకు అందని పశుగ్రాస విత్తనాలు
- గడ్డి కొరతతో పాడి రైతుల ఇబ్బందులు

అడవిలో అక్రమార్కులు

- సుజ్ఞానపురం బీట్‌లో భారీగా చెట్ల నరికివేత
- రెండేళ్లుగా దురాక్రమణకు గురవుతున్న రిజర్వ్ ఫారెస్ట్
- పట్టించుకోని అటవీ అధికారులు

4

అడవిలో అక్రమార్కులు

- సుజ్ఞానపురం బీట్‌లో భారీగా చెట్ల నరికివేత
- రెండేళ్లుగా దురాక్రమణకు గురవుతున్న రిజర్వ్ ఫారెస్ట్
- పట్టించుకోని అటవీ అధికారులు


ఆక్రమణకు గురవుతున్న గుట్ట


అక్రమార్కులు నరికిన చెట్టు

దుమ్ముగూడెం ఏప్రిల్ 7: రిజర్వ్ ఫారెస్ట్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. నిత్యం వందలాది మంది తిరిగే ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ భూములు తరిగిపోతున్నాయి. ఆక్రమణలో భాగంగా ఇష్టారీతిన కోత యంత్రాలతో నిత్యం భారీ చెట్లను నరికేస్తున్నా అటవీ సిబ్బంది కన్నెత్తి చూడడం లేదు. అడవుల్లో రెండేళ్లుగా దురాక్రమణ జరుగుతోంది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

గుట్టలపై దురాక్రమణ

దుమ్ముగూడెం అటవీరేంజ్ పరిధిలోని దుమ్ముగూడెం సెక్షన్ సుజ్ఞానపురం బీటు కంపార్ట్‌మెంట్ 125లోని రిజర్వ్ ఫారెస్ట్ భూమి రెండేళ్లుగా ఆక్రమణకు గురవుతోంది. సుజ్ఞానపురం-తోగ్గూడేల మధ్య ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న రిజర్వ్‌ఫారెస్టు గుట్టలను సమీప రెండు గ్రామాలకు చెందిన వారు నెమ్మదిగా ఆక్రమిస్తున్నారు. తాజాగా రెండు వారాల నుంచి ఈ గుట్టలపై ఉన్న భారీ చెట్లను చేతి యంత్రాలతో కోత పెడుతున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో చెట్లను కోసేశారు. గత ఏడాది ఆక్రమణ మొదలవగా, తాజాగా రెండు వారాలుగా అది తీవ్రమైంది. నిత్యం ఇదే దారిలో విధులు నిర్వర్తించే బీటు సిబ్బంది ఈ ప్రయత్నాన్ని ప్రతిఘటించే యత్నం చేయకపోవడం గమనార్హం. చెట్లను నరికివేస్తున్న విషయం బీటు సిబ్బందికి తెలిసినప్పటికీ, తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కోతకోసిన చెట్లను త్వరగా అక్కడి నుంచి తరలించాలని బీటు సిబ్బంది ఆక్రమణదారులకు సలహాలిస్తున్నారని సమాచారం. అయితే ఉన్నతాధికారులు స్థానిక సమాచారాన్ని ఎందుకు పెడచెవిన పెడుతున్నారో అర్థం కావడం లేదని ప్రజలు అంటున్నారు. కాగా ఈ విషయమై రేంజ్ అధికారి కనకమ్మను ఫోనులో వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

రెండేళ్ల క్రితం సుజ్ఞానపురం బీటును ఆనుకొని ఉన్న డీ కొత్తూరు సెక్షన్ రిజర్వ్‌ఫారెస్టు భూమిలో చింతగుప్ప గ్రామపంచాయతీకి సంబంధించిన క్రీడా ప్రాంగణం బోర్డును సైతం పెట్టనీయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుపడ్డారు. ఈ విషయమై అప్పట్లో పంచాయతీ అధికారులకు, ఫారెస్ట్ సిబ్బందికి మధ్య వాదోపవాదాలు నడిచాయి. క్రీడా ప్రాంగణాల ఏర్పాటుపై నాటి కలెక్టర్ ఒత్తిడి మేరకు కేవలం బోర్డు మాత్రమే పెడతామని, మైదానం కూడా అవసరం లేదని మండల పరిషత్ అధికారులు సర్దిచెప్పినా వినకుండా అటవీ సిబ్బంది తమ విధులను ఖచ్చితంగా నిర్వహించారు. క్రీడా ప్రాంగణం పనులు చేసేందుకు వచ్చిన ఎక్సకవేటర్‌ను అటవీసిబ్బంది అడ్డుకున్నారు. దీంతో క్రీడా ప్రాంగనం బోర్డును చింతగుప్ప శ్మశాన వాటికలో పెట్టాల్సి వచ్చింది. నాడు అలా విధుల్లో కఠినంగా వ్యవహరించిన అటవీ సిబ్బంది నేడు వందలాది ఎకరాల రిజర్వ్ ఫారెస్టు గుట్టలు దురాక్రమణ జరుగుతుంటే నోరు మెదపక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

యూసీసీఆర్ అభ్యర్థులను గెలిపించాలి

- రాష్ట్ర నాయకుడు పోలెబోయిన మత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తయ్య

కామేపల్లి, ఏప్రిల్ 7: భారత కమ్యూనిస్ట్ విప్లవకారుల సమైక్యత కేంద్రం యూసీసీఆర్-ఎంఎల్ పార్టీ అభ్యర్థులను రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని ఆపార్టీ రాష్ట్ర నాయకులు పోలెబోయిన ముత్తయ్య అన్నారు. ఆదివారం మద్దులపల్లి గ్రామంలో నూకల మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 13 పార్లమెంట్ నియోజకవర్గ స్థానాల్లో అభ్యర్థులు బరిలో ఉన్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తగిన బుద్ధి చెప్పి తమ అభ్యర్థులను గెలించాలని కోరారు. కేంద్ర, రాషాలలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పరిపాలనంత బడా పెట్టుబడిదారులకే దేశ సంపదను దోచిపెడుతుందని అన్నారు. భూమి లేని పేద ప్రజలకు భూమి ఇప్పిస్తామని, ఇల్లు లేని పేదలకు రూ.5లక్షలు ఇస్తామని అన్నారు. ఖమ్మం పార్లమెంట్ బరిలో దండా లింగయ్య, మహబూబాబాద్ పార్లమెంట్ బరిలో పడిగ యర్రయ్య ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కల్తీ రామచంద్రయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సోంద్‌మియా, లెనిన్, ఉమ్మడి జిల్లా కార్యకర్తలు, నవోదయ కాళాకారులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడే ముఠా సభ్యుల అరెస్టు

- వివరాలు వెల్లడించిన జిల్లా అటవీశాఖాధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్

తల్లాడ, ఏప్రిల్ 7: తల్లాడ ఫారెస్టు రేంజ్ పరిధిలోని కనకగిరి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు వచ్చిన ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఆటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ తెలిపారు. వీరి వద్ద నుంచి కారు, మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆదివారం తల్లాడ ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు శనివారం అర్ధరాత్రి తల్లాడ ఫారెస్టు రేంజ్ పరిధిలోని గట్టుగూడెం సెక్షన్ బ్రాహ్మలకుంట బీట్ పరిధిలోని కనకగిరి అటవీ ప్రాంతంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కటికి వెంకటరామారావు ఆధ్వర్యంలో ఎఫ్‌బీవోలు టి.లావణ్య, ఎస్.నాగరాజు స్ట్రైకింగ్, బేస్ క్యాంపు సిబ్బంది గస్తీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ బేగంపేటకు చెందిన పి.సుగ్రీవ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండకు చెందిన డి.మిధున్‌కుమార్, హైదరాబాద్ అంబరుపేటకు చెందిన బి.వెంకట శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరానికి చెందిన బి.నారాయణరావు, పశ్చిమగోదావరి జిల్లా కల్వపూడికి చెందిన టి.నాగరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడుకు చెందిన బి.సురేష్‌లతో కూడిన ముఠా కారులో మారణాయుధాలతో వన్యప్రాణులను వేటాడేందుకు వచ్చి పట్టుబడ్డారని వివరించారు. ఆరుగురి వద్ద నుంచి కారుతోపాటు ఒక తుపాకీ, బులెట్, కత్తి, గొడ్డలిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి మధిర కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు. స్థానికులైన చంద్రుగొండ మండలానికి చెందిన మిధున్‌కుమార్, సురేష్‌ల సహకారంతో వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి కోసం బయటకు వచ్చే వన్యప్రాణులను సంహరించేందుకు వచ్చి ఆరుగురు పట్టుబడ్డారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సత్తుపల్లి ఫారెస్టు డివిజన్ అధికారి వి.మంజుల, టాస్క్‌ఫోర్స్ రేంజ్ ఆఫీసర్ కవిత మాధురి, డీఆర్వోలు కటికి వెంకటరామారావు, డి.శ్రీను, ఎఫ్ఎస్‌వోలు రవికుమార్, కిషోర్ పాల్గొన్నారు.

ఎన్‌డీఏ పరీక్షలో శ్రీవాత్సవకు 58వ ర్యాంక్



మధిర, ఏప్రిల్ 7: నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఫైనల్ పరీక్షల్లో మధిర విద్యార్థి కొండూరు చరణ్ శ్రీవాత్సవ 58వ ర్యాంక్ సాధించి పలువురు ప్రశంసలు అందుకున్నాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో చరణ్ శ్రీవాత్సవ తన ప్రతిభను చాటి తల్లి దండ్రులకు మంచి పేరుతీసుకొచ్చాడని శనివారం పలువురు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు కొండూరు యలమందరావు (వత్సవాయి, ఏపీ), సుజాత(చిలుకూరు) ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. చరణ్ శ్రీవాత్సవ 6వతరగతి నుంచి ఇంటర్ వరకు ఏపీలోని విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదువుకున్నాడు. ఎన్‌డీఏలో చేరేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఎంపికలో జాతీయ స్థాయిలో 58వ ర్యాంక్‌తో అర్హత సాధించిన శ్రీవాత్సవ అఖిల భారత స్థాయి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఫిటెనెస్ పరీక్షల అనంతరం మిలటరీ శిక్షణ ఇచ్చి త్రివిధ దళాల్లో అధికారిగా నియమించే అవకాశం ఉంటుంది.

ఉద్యోగులందరికీ అండగా ఉంటా

- టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు


మాట్లాడుతున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 7: ఉద్యోగులందరికి ఎల్లవేళలా అండగా ఉండి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెల్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. మండల పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలోని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు దంపతులకు ఆదివారం ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు రావలసిన బకాయిల విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కాలనీలో సీసీ రోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీ ఇబ్బందులు తలెత్తకుండా తన వంతు కృషి చేస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని స్వయంగా ఆహ్వానించి అభివృద్ధి పనులు చేయించే బాధ్యత తనదేనన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరపు వీరాంజనేయులు, రాంబాబు, మురళి, శ్రీను, బాలకృష్ణ, దుర్గా ప్రసాద్, వెంకట నరసమ్మ, రాధ, కవిత, జ్ఞానదేవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టోర్నీలో కేటీపీఎస్ క్రీడాకారుల ప్రతిభ


క్రీడాకారులతో కేటీపీఎస్ అధికారులు

పాల్వంచ, ఏప్రిల్ 7: జాతీయస్థాయిలో నిర్వహించే ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ బోర్డు ఉమెన్స్ గేమ్స్, మెన్ క్యారమ్స్, చెస్, లాన్ టెన్నిస్‌లలో కేటీపీఎస్ క్రీడాకారులు సత్తా చాటారు. గత నెల హర్యానాలో 29 నుంచి 31 వరకు జరిగిన టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచి కేటీపీఎస్ 5,6,7వ దశల క్రీడాకారులు విజయం సాధించి ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. జాతీయస్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులను చీఫ్ ఇంజనీర్లు ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు ఆదివారం వారిని అభినందించి సత్కరించారు.

రామాలయం వద్ద స్వాగత ద్వారం ఏర్పాటు


స్వాగత ద్వారం

భద్రాచలం, ఏప్రిల్ 7: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి జరుగుతున్న బ్రహ్మోత్సవ ఏర్పాట్లలో భాగంగా మిథిలా స్టేడియం సమీపంలో స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. రేపు ఉగాది పర్వదినం సందర్భంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. 17వ తేదీన స్వామి వారి కల్యాణం, 18న పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

మోదీని ఓడిద్దాం.. దేశాన్నిరక్షిద్దాం: ఆప్

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 7: అప్రకటిత ఎమర్జెన్సీ నడుపుతున్న మోదీని ఓడించి, దేశాన్ని రక్షించాలని వివిధ పార్టీల నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం ఆమ్‌ఆద్మీపార్టీ ఆధ్వర్యంలో జాతీయ కమిటీ పిలుపు మేరకు కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఖమ్మం కలెక్టర్ కార్యాలయం వద్దగల ధర్నాచౌక్‌లో జరిగిన సాముహిక సత్యాగ్రహ దీక్షలలో పాల్గొని వివిధ పార్టీల నేతలు మోదీ నిరంకుశ పాలనపై ధ్వజమెత్తారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పూల మాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రకటన రాగానే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాటి వెంకటేశ్వరరావు, ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి గంధం పుల్లయ్య, ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్, సిద్దెల రాంబాబు, చరపా పాపారావు దొర, నాగేంద్ర బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

పశుగ్రాసానికి గడ్డుకాలం

- నేటి వరకు అందని పశుగ్రాస విత్తనాలు
- గడ్డి కొరతతో పాడి రైతుల ఇబ్బందులు



కల్లూరు, మార్చి 7: పాడి పోషణతో జీవనాధారం గడుపుతున్న కల్లూరు మండలం పరిసర గ్రామాల రైతులు ఈ ఏడాది వేసవి సీజన్‌లో పశుగ్రాసం కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది వానకాలంలో ఆశించిన రీతిలో వర్షాలు కురవక రెండు (వానాకాలం, యాసంగి) పంటలను ఎక్కువ శాతం కోల్పోయారు. ఈ పరిస్థితిలో పాడి పోషణపై ఆధారపడి జీవనం గడుపుతున్న ఈ ప్రాంతానికి చెందిన పాడి రైతులు తీవ్రమైన పశుగ్రాస కొరతను ఎదుర్కొంటున్నారు. పశుగణాంక సమాచారం ప్రకారం మండలంలో పలు గ్రామాల్లో 22 వేల గేదలు(నల్లవి), ఆవులు 4వేలకు పైగా ఉన్నాయి.

వర్షాలు కురవనందున సాగర్ జలాలు రాక పోవటంతో కల్లూరు మండలంలో ఈ ఏడాది చెరువులు, కుంటల్లో నీటి మట్టం అడుగంటాయి. రెండు పంటలు కోల్పోవటంతో పశుగ్రాసానికి గడ్డుకాలం దాపురించింది. వరి పొలాల్లో గట్ల పై ఈ దశలో పశువులకు పచ్చి మేత కూడా దొరకటం కష్టసాధ్యంగా మారింది. పాడి రైతులు తమ పశువులను ఆరు బయట పచ్చిక బయిళ్లలో వరి పొలాల్లో పశవులను మేతకు వదలగా గ్రాసం అందుబాటులో లేక అల్లాడుతున్నాయి. ఈ వేసవి సీజన్‌లో చెరువులు, కుంటల్లో నీరు కూడ ఆశించిన మేరకు లేక పోవటం, ఉన్న కాస్తాంత నీరు అడుగంటి పోతుండటంతో పశువులకు తాగునీటి ఎద్దడి కూడా దాపురించన్నది. ప్రధానంగా వరి పంట కూడా ఆశించిన స్థాయిలో సాగులేక ఎండు గడ్డి కూడ కొరత ఏర్పడింది. ఈ వేసవి సీజన్‌లో మార్చి నుంచి మే నెల వరకు మూడు నెలలు పాటుగా పశుగ్రాసం కొరతను అధికమించడం రైతులకు సవాల్‌గా మారింది.

ఎండుగడ్డికి గిరాకీ...

ఈ ఏడాది వ్యవసాయా సీజన్‌లో వర్షాలు లేక నిరాశజనకంగా మారింది. మరో వైపున ఈ ప్రాంతం రైతులు పాడి పశుపోషణపై ఆధారపడి జీనవం గడుపుతారు. ఎండు గడ్డి కొరత కూడా త్రీవంగా ఉంది.దీంతో ఎండ్డు గడ్డి ఖరీదుగా మారంటంతో పాడి రైతులకు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక కట్ట గడ్డి ధర గతంలో రూ.80 ఉండగా ఇప్పుడు రూ.120 కు చేరింది. పంటలు కూడా పరిమితంగా సాగు అయినందున ఎండు గడ్డి కొరత ఏర్పడింది. పశువులకు ఆరుబయట ప్రదేశాల్లో మేత దొరక పాడి పోషణపై తీవ్రమైన ప్రభావం పడటంతో పాలదిగుబడి తగ్గే ఆవకాశం ఏర్పడింది.

పచ్చిమేతకు అందని పశుగ్రాసం విత్తనాలు...

పాడి పోషణగా నిలిచిన కల్లూరు మండలానికి ప్రతీ ఏడాది ప్రభుత్వం వారు పశుసంవర్ధకశాఖ తరుపున వేసవి సీజన్‌కు ముందుగానే సబ్సిడీపై పచ్చిమేతగా విత్తనాలు సరఫరా చేస్తారు. ఈ ఏడాది సీజన్‌కు గాను అందుకు భిన్నంగా విత్తనాలు రైతులకు అందించని పరిస్థితి. దీంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన పాడి రైతులు పశుగ్రాస విత్తనాల కోసం పశువుల ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నారు. విత్తనాలు రాలేదని పశుసంవర్ధకశాఖ వారు చెప్పడంతో పాడి రైతులు నిరాశ చెందుతున్నారు.

ఈ విషయమై కల్లూరు పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి మమతను వివరణ కోరగా కల్లూరు మండలానికి గాను పచ్చిమేత కోసం ఒక టన్ను విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అయితే వేసవి సీజన్ వచ్చినా నేటికీ పశుగ్రాస విత్తనాలు అందక పోవటం రైతులకు శాపంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశుగ్రాస కొరతను నివారించేందుకు తగిన విధంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జ్వరంతో గురుకుల పాఠశాల విద్యార్థి మృతి

- అలస్యంగా వెలుగు చూసిన ఘటన

మధిరరూరల్, ఏప్రిల్ 7: ఖమ్మం జిల్లా మధిర మండలం జిలుగుమాడు గ్రామంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థి జ్వరంతో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఖమ్మంజిల్లా కూసుమంచి మండలం తురకగూడెం గ్రామానికి చెందిన కన్నెబోయిన వేణుగోపాల్(10)అనే విద్యార్థి మధిర మండలం జిలుగుమాడులోగల మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. అయితే ఈనెల మూడోతేదీన పరీక్షల సమయంలో ఈ విద్యార్థికి జ్వరం వచ్చింది. వెంటనే క్లాస్‌టీచర్, స్టాఫ్‌నర్సు కలిసి వేణుగోపాల్‌ను మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. తరువాత తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు కూడా మధిర ఆసుపత్రికి వచ్చారు. మూడోతేదీ సాయంత్రం వేణుగోపాల్‌ను అతడి తండ్రి ఇంటికి తీసుకువెళ్లాడు. ఇంటికి వెళ్లిన వేణుగోపాల్‌కు ఐదోతేదీ రాత్రి తీవ్ర జ్వరం రావడంతో ఖమ్మం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వేణుగోపాల్ శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. విద్యార్థి మృతిపై మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ షమీమ్‌ను విలేకరులు సంప్రదించగా విద్యార్థి వేణుగోపాల్‌కు జ్వరం రాగానే తక్షణమే మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించామన్నారు. అనంతరం ఈ విషయాన్ని తల్లిదండ్రులు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారు మధిర ఆసుపత్రికి వచ్చి అదేరోజు సాయంత్రం విద్యార్థిని ఇంటికి తీసుకువెళ్లారని తెలిపారు. ఈ విద్యార్థికి వైద్యం చేయించే విషయంలో తాము ఎలాంటి అలసత్వం వహించలేదన్నారు. జ్వరం వచ్చిన వెంటనే మధిరలో ఆసుపత్రికి తీసుకెళ్లామని తెలిపారు.



పంచదారకు ప్రత్యామ్నాయం

మధుపత్రి

- మధుమేహాన్ని అదుపుచేసే గుణాలు
- ఔషధ మొక్కల బోర్డుద్వారా ఎకరాకు రూ.60,280 రాయితీ
- ఉద్యాన విభాగ ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి

అశ్వారావుపేట, ఏప్రిల్ 7: మధుమేహాన్ని అదుపులో ఉంచడమేకాకుండా, పంచదారకు ప్రత్యామ్నాయంగా మధుపత్రి(స్టీవియో)అనే మొక్క ఉపయోగపడుతుంది. మధుమేహంతో బాధపడే వారు ఈ మధుపత్రిని నమిలి తింటే వ్యాధి పూర్తిగా అదుపులో ఉంటుంది. అంతేకాక రైతులకు సిరులు పండిస్తుందని అంటున్నారు అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఉద్యాన విభాగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి.

అందుబాటులో రాయితీ..

స్టీవియో పంట సాగు ప్రోత్సాహం కోసం జాతీయ ఔషధ మొక్కల బోర్డు, తెలంగాణా ఔషధ మొక్కల బోర్డులు ఎకరా సాగుకోసం రూ.60,280లను సబ్సిడీ రూపంలో అందిస్తున్నాయి. సాగు ఖర్చుల కోసం బ్యాంకులు ఈ పంటకు రుణాలు అందిస్తున్నాయి. ఈ పంటను పండించిన తర్వాత మార్కెటింగ్‌కు కూడా రైతులు ఇబ్బందులు పడనవసరం లేదని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త ఐవీఎస్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మార్కెటింగ్ చేయాలనుకునేవారు ఫోన్‌నెం. 9441168156ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

అనుకూల నేలలు..

నీరు నిలువని ఎర్ర గరపనేలలు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు, తేలిక నేలలు ఈ పంట సాగుకు అనుకూలం. ఉదజని సూచిక 6.0-7.5 ఉన్న నేలలు అనుకూలం. ఈ పంట వేరుకుళ్లు వ్యాధికి త్వరగా లొంగిపోతుంది. కాబట్టి మురుగునీరు పోయే వసతిని ఏర్పాటు చేసుకోవాలి. నాలుగువారాల వయస్సున్న మొక్కలు ప్రధాన పొలంలో నాటుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. ఎత్తైన మడులపై రెండు వరుసలలో ఇరువైపుల 25 సెం.మీ. దూరంలో జిగ్‌జాగ్ పద్ధతిలో మొక్కలు నాటుకోవాలి. ఎకరాకు 25-30 వేల మొక్కలు నాటుకోవచ్చు.

కిలోకు రూ.200లతో మార్కెటింగ్

మొక్క పూత పూయడం గమనించిన



ప్పుడు కోత కోయాలి. మొక్క అడుగుభాగం నుంచి 10-15 సెం.మీ వదిలి, మిగతా మొక్కనంతా కత్తిరించి నీడలో ఎండబెట్టి ఆకులు వేరుచేసి మార్కెటింగ్ చేసుకోవచ్చు. ఆకులను పొడిగా మార్చి మార్కెటింగ్ చేసుకోవచ్చు. దుమ్ము, ధూళి లేకుండా ఆకుపచ్చగా ఉన్న ఎండిన ఆకులను కిలో రూ.200 చొప్పున ప్రస్తుతం ధర పలుకుతుంది. స్టీవియో ఒక్కో మొక్క ధర రూ. 5వరకు ఉంటుంది. రూ. 1,50,000ల వరకు ఎకరాకు మొక్కలకు ఖర్చు అవుతుంది.

మిషన్ భగీరథ ఇన్‌టెక్ వెల్‌ను సందర్శించనున్న సుల్తానియా

అశ్వాపురం, ఏప్రిల్ 7: మండల పరిధిలోని కుమ్మరిగూడెం వద్ద నున్న మిషన్‌భగీరథ ఇన్‌టెక్ వెల్‌ను సోమవారం గ్రామీణ మంచినీటి సరఫరా ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సందర్శించనున్నారు. ఈమేరకు ఆదివారం మిషన్‌భగీరథ జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేపట్టారు. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లాకు తాగునీటి సరఫరా చేసే మిషన్ భగీరథ కు నీటి నిల్వలు తగ్గనున్నాయన్న నేపథ్యంలో క్షేత్ర స్థాయి పరిశీలనకు ఉన్నతాధికారులు రానున్నారు. అధికారుల బృందంలో ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, సీఈ శ్రీనివాస్, ఎస్ఈ సదాశివకుమార్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కూలీ మృతి

మధిరటౌన్,ఏప్రిల్7: విద్యుదాఘాతంతో ఓ భవన నిర్మాణ కూలీ మృతి చెందిన సంఘటన ఆదివారం మధిరలో జరిగింది. మధిర మండలం రామచంద్రాపురానికి చెందిన కాకర్ల తిరుపతిరావు(20) మధిరలో తాను పనిచేసే నిర్మాణ స్థలంలో విద్యుత్‌తో నడిచే ఇసుక జల్లెడలో ఇసుక పోస్తుండగా దానికి విద్యుత్ ప్రసరణ కావడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. టౌన్ ఎస్ఐ సంధ్య సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్7: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దేశిరెడ్డి కేశవరెడ్డి (45) కుటుంబ సభ్యులతో కలిసి కూల్ డ్రింక్ షాప్ నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో భార్య వెంకటరమణితో తరచూ ఘర్షణలు చోటుచేసుకోగా మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక సంఘం మాజీ నేతకు పాయం పరామర్శ



మణుగూరుటౌన్, ఏప్రిల్ 7: సింగరేణి మాజీ కార్మిక సంఘం నాయకుడు, కాంగ్రెస్ పార్టీ నేత నామా వెంకటేశ్వరరావును ఆదివారం హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు. నామ వెంకటేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్న విషయం విధితమే. కాగా ప్రమాదం జరిగిన రోజు నుంచి కోమాలోనే ఉన్న నామా వెంకటేశ్వరరావు పరిస్థితి దాదాపు అలాగే ఉండడంతో వారి కుటుంబ సభ్యులను అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. నామా ఆరోగ్యస్థితిగతులపై ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడారు.

కష్ట కాలంలో పార్టీకి అండగా ఉంటా

కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

ఆరు గ్యారంటీల అమల్లో ఆ పార్టీ విఫలం

ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

జూలూరుపాడు, ఏప్రిల్ 7: కష్టకాలంలో బీఆర్ఎస్‌కు అండగా నిలబడతానని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీదే భవిష్యత్తు అని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం జూలూరుపాడులోని పామాయిల్ తోటలో ఆ పార్టీ నాయకులతో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోనికి వచ్చిందని, వాటిని నెరవేర్చకపోవడంతో ప్రజల్లో ఆ పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. సాగునీరు, తాగు నీరు లేక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు ఎకరాకు రూ.25 వేల పంట నష్టపరిహారం చెల్లించడంతో పాటు, వరి పంటకు రూ.500లు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాలలోని ప్రజల వద్దకు వెళ్లి కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. రైతుల కుటుంబాలకు అండగా నిలిచిన ఏకైక నాయకుడు కేసీఆర్ అన్నారు. తాను ఎంపీగా గెలవకముందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్క నేషనల్ హైవే ఉండేదికాదని తాను గెలిచిన తరువాత కేంద్రంతో పోరాడి కొన్ని రోడ్లను నేషనల్ హైవేగా మార్చినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసుదన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, తాళ్ళూరి జీవన్‌కుమార్, జెడ్పిటీసీ కళావతి, నాయకులు పిజి.కృష్ణమూర్తి, లాకావత్ గిరిబాబు, చావా వెంకటరామారావు, దుద్దుకూరి నాగేశ్వరరావు, దుద్దుకూరి కృష్ణప్రసాద్, మోదుగు రామకృష్ణ, చాపలమడుగు రామ్మూర్తి, రాము పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి: వద్దిరాజు

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జూలూరుపాడులో జరిగిన పార్టీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోయినప్పటికి బీఆర్ఎస్ బలమైన రాజకీయ పార్టీ అని, కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దు అని తాము కొండంత అండగా ఉంటామని అన్నారు. అధికార పార్టీ నాయకులు పెట్టే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

కేసులకు భయపడవద్దు అని, పార్టీ శ్రేణులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోనికి వచ్చిందని, వాటిని నెరవేర్చకపోవడంతో ప్రజల్లో ఆ పార్టీ పై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని అన్నారు.

కూనంనేని సమక్షంలో సీపీఐలో చేరికలు



సీపీఐలో చేరిన వారితో ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ మండల పరిధిలోని కోమటిపల్లి ఎంపీటీసీ మూడు గణేష్ ఆదివారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సీపీఐలో చేరారు. ఎంపీటీసీ గణేష్‌తోపాటు కోమటిపల్లి గ్రామానికి చెందిన రాంచందర్, గణేష్ రామచంద్రు, ప్రశాంత్, రాంబాబు తదితరులు సీపీఐలో చేరిన వారిలో ఉన్నారు. గ్రామంలో జరిగిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం సందర్భంగా వీరు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కూనంనేని పార్టీ కండువాను కప్పి ప్రాథమిక సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించాలని తద్వారా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, జిల్లా కార్యవర్గసభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు భూక్యా దను, కంచర్ల జమలయ్య, కొమారి హనుమంతరావు, రాములు, శ్రీనివాస్, ఎంపీటీసీ భూక్యా పద్మావతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికను గర్భవతిని చేసిన యువకుడు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 7: వరుసకు బంధువైన యువకుడు ఓ బాలికను గర్భవతిని చేసిన ఘటన భద్రాద్రి జిల్లా కొత్తగూడెం జిల్లాలో ఆదివారం వెలుగు చూసింది. జిల్లాలోని ఓ మారుమూల గిరిజన ప్రాంతంలో వ్యవసాయ కూలీ పనులతో జీవనం సాగిస్తున్న ఓ కుంటుంబానికి చెందిన బాలికతో బావ వరుస అ య్యే యువకుడు చనువుగా ఉండేవాడు. దీంతో ఇరు కుటుంబ సభ్యులు వీరికి వివా హం జరిపించేందుకు నిర్ణయించుకోగా, ఆ బాలిక మైనర్ కావడంతో కొన్ని రోజులకు వేచి ఉండాలనుకున్నారు. కానీ ఆదివారం బాలిక ఒక్కసారిగా తనకు కడుపు నొప్పి వస్తుందని తెలపడంతో తల్లిదండ్రులు జిల్లా కేంద్రంలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు సదరు బాలిక గర్భవతి అని నిర్ధారించారు. ప్రస్తుతం ఆ బాలిక ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉందని, ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను అధికారులు, కుటుంబ సభ్యులు గోప్యంగా ఉంచారు.

రంజాన్ కిట్ల పంపిణీ

బూర్గంపాడు, ఏప్రిల్ 7: సారపాక పట్టణంలోని సాజీదా మజీద్ ఆవరణలో జమాతే ఇస్లామిక్ హిందూ ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ తోఫా ఈద్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ఇషాక్, ప్రధాన కార్యదర్శి జహీర్ పాషా, షేక్ అబ్దుల్ సలీం, నాగూర్‌వలి, సైదుద్దీన్ పాల్గొన్నారు.

అంకంపాలెంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

దమ్మపేట, ఏప్రిల్ 7: అంకంపాలెం ఫ్రెండ్స్ యూత్ , అప్పారావు, దీలిప్ మెమోరియల్ అశ్వారావుపేట నియోజక వర్గ స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం అంకంపాలెంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తనయుడు శ్రీకాంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాదు, బొల్లికొండ నాగేశ్వరరావు, పర్వతనేని ప్రసాదు, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, గోపిశాస్త్రి, రాధాకృష్ణ, వెంకట్రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మహనీయుల చరిత్రను మననం చేయాలి'

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 7: మహనీయుల చరిత్రను మననం చేసి భావితరాలకు వారి జీవిత చరిత్రను, వారి ఉద్యమ స్ఫూర్తిని అందించడమే భీం దీక్ష ముఖ్య ఉద్దేశ్యమని స్వేరోస్ ఇంటర్నేషనల్ నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి తరుణ్ హరిబాబు అన్నారు. పాల్వంచలో ఆదివారం జరిగిన భీం దీక్షలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 14 వరకు పవిత్ర మాసంగా భావిస్తుంటామన్నారు. ఈ నెల రోజుల్లో మహనీయుల జయంతి, వర్ధంతులు ఉంటాయని ఈ మాసంలో వారి చరిత్రను చదవడం, మాంసాహారం, మద్యపానానికి దూరంగా ఉండటం ఈ భీం దీక్షలో భాగం అన్నారు. ఈ సందర్భంగా ఈ విందును ఏర్పాటు చేస్తుంటామన్నారు. ఈ సందర్భంగా స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిని వీరయ్య మాట్లాడుతూ 2014లో ఈ భీందీక్ష కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో మొదటి సారి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని స్వేరోస్ ఫౌండర్ డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారన్నరు. రాష్ట్రవ్యాప్తంగా ఈ భీం దీక్షలుంటాయన్నారు. అందులో భాగంగానే సిద్దిపేటలో పల్లె నిద్ర నిర్వహించామన్నారు. భయ నిర్మూలన, విద్యనిధి కార్యక్రమాలు చేపడతామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది స్వేరోస్ పాల్గొన్నారు. పలు కార్మిక, ఉద్యోగ, కుల సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.



భీం దీక్షలో పాల్గొన్న స్వేరోస్

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

జూలూరుపాడు, ఏప్రిల్ 7: కేంద్రంలో పది సంవత్సరాల పాటు బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండి విద్యార్థి, యువతను విస్మరించిందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి షేక్ చాంద్‌పాషా అన్నారు. ఆదివారం జూలూరుపాడులో ఏర్పాటు చేసిన ఆ సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధానీ మోధీ హామీ ఇచ్చి దానిని నెరవేర్చలేదని ఆరోపించారు. విద్యను వ్యాపారమయం చేసి పేదలకు విద్యను అందని ద్రాక్షలా మార్చారని విమర్శించారు. మోధీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి విద్యార్థులు, యువత సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పసపులేటి పవన్, కొండ హనుమంత్‌రావు, మౌలి, నాగయ్య, సురేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 7: ఈ నెల 9, 10, 11 తేదీల్లో పాల్వంచ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉగాది ఉత్సవాల ప్రచార పోస్టర్లను ఆదివారం ఉత్సవకమిటీ సలహాదారు కొత్త వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు డాక్టర్ బిక్కసాని సుధాకర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాధ్యులు మాట్లాడారు.

ముగ్గురి మృతిపై కేసు నమోదు

దమ్మపేట, ఏప్రిల్ 7: మందలపల్లి గ్రామ సమీపంలో శనివారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకన్న ఘటనలో తల్లితో సహ ఇద్దరు కుమార్తెలు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటనపై మృతురాలి తల్లి పండేటి మరియమ్మ దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామానికి చెందిన పండేటి వెంకటేశ్వరరావు మరియమ్మల కుమార్తె లక్ష్మి ఆంధ్రరాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన వంగూరి మారేశ్వరావుతో 10 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి శరణ్యశ్రీ(8), షాణ్మితశ్రీ (6) అమ్మాయిలు వున్నారు. కొంతకాలం నుంచి విభేదాల కారణంగా లక్ష్మి భర్తకు దూరంగా వుంటూ పిల్లలతో కలిసి తల్లి వద్దే వుంటుంది. ఈ క్రమంలో ఆంధ్రరాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా ఏకొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన చీపు బాలకృష్ణతో లక్ష్మికి పరిచయం ఏర్పడింది. దీంతో లక్ష్మి పిల్లలతో సహా బాలకృష్ణతో 10 నెలల నుంచి సహజీవనం చేస్తూ కుటుంబ పోషణకు కూలీపనులు చేస్తూ అక్కడక్కడ నివశిస్తున్నారు. ఇదే క్రమంలో అశ్వారావుపేట మండలంలో ఒక కోళ్ల ఫాంలో పనికి చేరారు. వినన్నపేట మండలం చంద్రుపట్ల గ్రామంలో శనివారం జరిగిన వేడకకు లక్ష్మి పిల్లలతో కలసి బాలకృష్ణ తన ద్విచక్ర వాహనంపై వెళ్ళి పాల్గొన్నాడు. అశ్వారావుకు వచ్చే క్రమంలో మండలపల్లి గ్రామ సమీపంలో లారీ వేగంగా వెళుతూ అదుపు తప్పి ద్విచక్రవాహానాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బాలకృష్ణ తీవ్రగాయాలు లక్ష్మి, కుమార్తెలు అక్కడిక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన లారీ ప్రమాదం జరిగిన ఆగకుండా అశ్వారావుపేట వెళ్ళి పోలీసులకు డ్రైవర్ లొంగిపోయాడు. ప్రమాదానికి కారణమైన లారి, డ్రైవర్‌ను దమ్మపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లారీ రాజస్థాన్ రాష్ట్రానికి చెందినది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు విచారణ జరుపుతున్నారు.

అధికారుల సమస్యలపై దశలవారీ ఆందోళన

మణుగూరుటౌన్, ఏప్రిల్ 7: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అధికారుల సమస్యల పరిష్కారానికి దశలవారీ ఆందోళనలను చేపట్టాలని సీఎంఓఏఐ సింగరేణి బ్రాంచి సమావేశంలో సభ్యులు ఏకగ్రీవ తీర్మాణం చేసారు. ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో ఆదివారం కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) సింగరేణి బ్రాంచి నూతన కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్ ఆధ్వర్యంలో ప్రథమ సమావేశం నిర్వహించారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి వార్షికోత్సవం



జాతరలో పాల్గొన్న గ్రామ పెద్దలు, భక్తులు

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 7: శేఖరంబంజరలో ఆదివారం ముత్యాలమ్మతల్లి, బొడ్రాయి, నాభిశిల ప్రథమ వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు భక్తితో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామనాయక్ బాలునాయక్, కార్‌చారి, సామానాయక్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు శంకర్, రాజు, బాలు, సురేష్, రవి, కిషోర్, శేఖర్, గోపీ, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నవీన్ బాబు

జూలూరుపాడు, ఏప్రిల్ 7: ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు నిబంధనలను పాటించాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని వైరా నియోజకవర్గ ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి కె.నవీన్‌బాబు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరాంతండా గ్రామ సమీపంలో సిబ్బందితో కలిసి ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలలో ఎవరైన వ్యక్తులు నగదును అక్రమంగా తరలిస్తుంటే సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. అక్రమంగా మద్యం తరలించిన, గ్రామాలలో బెల్ట్ షాపుల్లో మద్యాన్ని విక్రయించినట్లు అయితే ఉపేక్షించబోమని తెలిపారు. ఇప్పటికే వైరా నియోజకవర్గంలో బెల్ట్ షాపుల్లో మద్యాన్ని స్వాధీనం చేసుకొని పలువురు నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారి సమాచారాన్ని ప్రజలు అందించాలని ఆయన కోరారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని కోరారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులకు సహకరించాలని కోరారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గనిపాషా, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సాయిరాంతండా సమీపంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రణాళికతో తాగునీరు సరఫరా చేయాలి

కలెక్టర్ ప్రియాంక అల

పాల్వంచ, ఏప్రిల్ 7: రానున్న రెండు నెలలు ప్రణాళికతో మంచినీరు సరఫరా చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. ఆదివారం మిషన్ భగీరథ అధికారులతో కలసి పాల్వంచ మండలం తోగ్గూడెంలోని మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్‌ను ఆమె సందర్శించారు. మంచినీటి సరఫరా, రోజువారీ నీటి డిమాండ్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. నీటిశుద్ధి ప్రక్రియలోని దశలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలం ప్రతి ఇంటికీ నల్లానీరు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే రెండు నెలలు చాలా కీలకమని, నీటి సరఫరాలో లోటు పాట్లు ఉంటే సరిదిద్దుకోవాలని అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ ఏఈలు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. మిషన్ భగీరథ నుంచి నీటి సరఫరా లేని ప్రాంతాలకు స్థానిక వనరులు బావులు, బోర్లు ద్వారా నీరు అందించే చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, చుట్టూ క్లోరినేషన్ చేయాలని, లీకేజీలకు మరమత్తులు చేయించి ప్రజలకు నీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



భగీరథ ట్యాంకులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక అల

తెల్లం వెంకట్రావుపై రేగా ఫైర్

మణుగూరు, ఏప్రిల్ 7: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కాంగ్రెస్‌లో చేరిక పట్ల ఫైర్ అయ్యారు. ఆదివారం సోషల్ మీడియాలో ప్రకటన విడుదల చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు హాజరు కావడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ప్రకటించారు. అతనిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తున్నామని, స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకు వెళతామన్నారు. ఈ విషయాన్ని కోర్టులోనే తేల్చుకుంటాని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లో చేరడం పార్టీకి వ్యతిరేక చర్యలకు పాల్పడినట్లే అన్నారు. ఓ పార్టీలో గెలిచి మరొక పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టండని పిలుపునిచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని ఇప్పుడు దేనితో కొట్టాలి అని ఆయన ప్రశ్నించారు.

పేదలకు సహాయం చేసినప్పుడే సంతృప్తి

కరకగూడెం, ఏప్రిల్ 7: నిరు పేదలకు మనకు తోచినంత సహాయం చేసినప్పుడే మనకు సంతృప్తి కలుగుతుందని ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్ సంస్థ సభ్యులు షేక్ సోందుపాషా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తన నివాసంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాలకు రంజాన్ పండుగను పురస్కరించుకుని రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ అల్లాహ్ కృపకు పాత్రులవుతారని అన్నారు. రానున్న రోజుల్లో పేదల అవసరాలను గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

రాష్ట్రాల అభివృద్ధి కోసం ప్రత్యేక మేనిఫెస్టో

దుమ్ముగూడెం, ఏప్రిల్ 7: రాష్ట్రాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేయడం ప్రజల పట్ల పార్టీకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. లక్ష్మీనగరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. తెలంగాణాకు ప్రకటించిన మేనిఫెస్టోలో పంచ వాగ్దానాలతోపాటు, ఆంధ్రాలో కలిసిన ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణాలో కలిపే ప్రత్యేక అంశాన్ని చేర్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే భద్రాచలం రెండవ వంతెన నిర్మాణ పనుల పూర్తి, కరకట్ట నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తవుతున్నాయని తెలిపారు. మండల అధ్యక్షుడు వీవీ నీల్, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, చింతిరాల రవికుమార్, రౌతు నర్సింహారావు, బత్తుల శోభన్‌బాబు, అప్పలరెడ్డి, కనుబుద్ధి దేవా, రామిరెడ్డి, వెంకటరమణారెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న కారును ఢీ కొట్టిన డీసీఎం

ఆళ్లపల్లి, ఏప్రిల్ 7: ఆగి ఉన్న కారును డీసీఎం ఢీ కొట్టిన సంఘటన కాచనపల్లి (కొమరారం) పోలీస్‌స్టేషన్ వద్ద జరిగింది. గుండాల మండల కేంద్రానికి చెందిన ఇర్ప కిశోర్, తన తండ్రి ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం తన తల్లిని తీసుకుని కారులో గుండాల నుంచి ఖమ్మం బయలుదేరాడు. మార్గ మధ్యలో కాచనపల్లి(కొమరారం)పోలీసులు స్టేషన్ ముందు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అతడు తన కారును పక్కకు పెట్టి దిగే క్రమంలో ఇల్లందు నుంచి గుండాలకు వస్తున్న డీసీఎం ఎదురుగా వచ్చి ఆగి ఉన్న కారును ఒక్కసారిగా ముందు భాగంలో ఢీకొట్టింది. కారులో ఏయిర్ బెలున్స్ ఓపెన్ కావడంతో కారులో ఉన్న ఇరువురికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ సీజ్

పాల్వంచ, ఏప్రిల్ 7: దమ్మపేట సెంటర్ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న లారీని తనిఖీ చేయగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి స్థానిక టింబర్ డిపోకు తరలించారు. అదే విధంగా పేటచెరువు నుంచి పాల్వంచ వైపు ద్విచక్రవాహనంపై టేకు కలపను తరలిస్తుండగా వాహనాన్ని అదులోకి తీసుకుని డిపోకు తరలించారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందని పాల్వంచ రేంజి అధికారి అనిల్ తెలిపారు.

చెక్ డ్యాం నిర్మాణంతో గ్రామంలో రాజుకున్న వివాదం

జూలూరుపాడు,ఏప్రిల్ 7: చెక్ డ్యాం నిర్మాణ విషయంలో గ్రామస్తుల మధ్య వివాదం రాజుకుంది. గత రెండు రోజులుగా సంబంధిత కాంట్రాక్టర్ పనులను చేపడుతుండగా చెక్ డ్యాం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, ఓ ఆదివాసి మహిళ రైతుకు చెందిన పట్టా భూమిలో గ్రామ సమీపంలో చెక్ డ్యాంను నిర్మించ వద్దని గ్రామస్తులు అడ్డుకున్నారు. కాగా అదే గ్రామానికి చెందిన మరికొంత మంది గ్రామస్థులు నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతుండటంతో ఒకే గ్రామానికి చెందిన వారి మధ్య వివాదం నెలకొంది. ఆదివారం చెక్‌డ్యాం పనులను చేపడుతుండగా బాధిత మహిళ రైతు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మూకుమ్మడిగా వెళ్లి అడ్డుకున్న సంఘటన బేతాళపాడు పంచాయతీ పరిధిలోని చీపురిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే మండలంలోని బేతాళపాడు పంచాయతీ పరిధిలోని చీపురిగూడెం గ్రామ సమీపంలో పెద్దవాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రభుత్వం రూ 1.50కోట్ల నిధులను కేటాయించింది కాగా ఐబీ అధికారులు చీపురిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి మహిళ రైతు బట్టు రుక్మిణమ్మకు చెందిన పట్టా భూమిలో చెక్ డ్యాం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. దీంతో సంబందిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులను ప్రారంభించటంతో బాధిత మహిళ రైతు, ఆమె కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. తమ పట్టా భూమిలో చెక్ డ్యాం నిర్మాణాన్ని ఎలా చేపడతారని, తమకున్నది 1.06 కుంటల భూమి మాత్రమేనని, ఈ భూమిలోనే పంట సాగు చేస్తు ఇద్దరు కుమారులు, తాను జీవనం సాగిస్తున్నామని మహిళ రైతు తెలిపారు. తమ పట్టా భూమిలో చెక్ డ్యాం నిర్మిస్తున్నట్లు అధికారులు సమాచారం ఇవ్వలేదని, పనులను ప్రారంభించే రోజే చెప్పారని ఆవేదన చెందారు. నిర్మాణాన్ని అడ్డుకుంటే భూమి మొత్తం పోతుందని, కేసులు పెడతామని అధికారులు బెదిరిస్తున్నట్లు తెలిపారు. తమ పట్టా భూమిలో చెక్ డ్యాంను నిర్మిసే తమ కుటుంబం తీవ్రంగా నష్టపోవడంతో పాటు వీధిన పడాల్సి వస్తుందని మహిళ రైతు అన్నారు. చెక్ డ్యాం నిర్మాణానికి గతంలో అధికారులు రెండు స్థలాలను గుర్తించగా అక్కడ రైతులు అడ్డుకోవడంతో తమ భూమిలో నిర్మాణాన్ని చేపడుతూ అన్యాయం చేస్తున్నారని బాధిత మహిళ రైతు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇక్కడ చెక్ డ్యాం నిర్మాణం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. తమ పట్టా భూమిలో నిర్మిస్తున్న చెక్ డ్యాం నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా గ్రామ సమీపంలో చెక్ డ్యాంను నిర్మించటం వల్ల గ్రామంలోకి వరద వస్తుందని, ఈ ప్రాంతంలో చెక్ డ్యాం నిర్మాణంతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని గ్రామస్తులంటున్నారు.



తమ భూమిలో చెక్‌డ్యాం నిర్మాణం చేపడుతున్నారంటున్న బాధితులు